RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 16 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | శనివారం 18-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

**విలేకరులు కావలెను**

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

**9182328292**

## అపార్ట్‌మెంట్లలో ఈవీ చార్జింగ్ పాయింట్లు తప్పనిసరి

**- తెలంగాణ సర్కారు కొత్త పాలసీ**



**హైదరాబాద్** తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇకపై రాష్ట్రంలోని అపార్ట్‌మెంట్ భవనాల బేస్‌మెంట్‌లో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. ఈ మేరకు ఇంధన శాఖ కసరత్తు చేస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ నిర్ణయంతో నగరవాసులకు ఇళ్లలోనే సులువుగా ఛార్జింగ్ చేసుకునే సౌకర్యం కలగనుంది. శుక్రవారం నాడు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఈవీ ఛార్జింగ్ మౌలిక

2లో..



# లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

**- మహిళా రిజర్వేషన్లకు లింకుపెట్టిన నియోజకవర్గాల పెంపు - ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం 528 మంది సభకు హాజరైన సభ్యులు**

**- బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు - మూడింట రెండింతల మెజార్టీ సాధించడంలో విఫలం**

**న్యూఢిల్లీ** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ లో వీగిపోయింది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. మొత్తం 528 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో 352 ఓట్లు రావాల్సి ఉండగా మూడింట రెండింతల మెజార్టీ సాధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. దీంతో మిగతా రెండు బిల్లులు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు-2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్టు ప్రకటించింది. బిల్లు వీగిపోవడంతో లోక్‌సభ నియోజకవర్గాలను 850కి పెంపునకు బ్రేక్‌లు పడ్డాయి. ఓటింగ్ ముగియడంతో స్పీకర్ సభను శనివారానికి వాయిదా వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రతిపక్షాలపై కిరణ్ రిజిజు విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.
రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదం పొందాలంటే సభకు హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో 537 మంది సభ్యుల ఉండగా మూడింట రెండు వంతుల మెజారిటీకి 360 సీట్లు అవసరం. 293 మంది సభ్యులున్న అధికార ఎన్డీఏకు 67 సీట్లు తక్కువగా ఉన్నాయి. రాజ్యసభలో మెజారిటీకి కావలసిన కీలక సంఖ్య 163 కాగా, 142 మందికి పైగా సభ్యులున్న ఎన్డీఏకు మెజారిటీ మార్కుకు 21 సీట్లు తక్కువగా ఉన్నాయి. గురువారం ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై చర్చ అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం వివరణ ఇచ్చారు. బిల్లును గంటలోనే మార్పులు సభలో ప్రవేశపెడితే మద్దతు ఇస్తారా? అని ఆయన ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపునకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుత 543 స్థానాలు ఉండగా వాటిని 850కి పెంచాలని యోచించారు. కానీ, దక్షిణాది రాష్ట్రాలకు దీని వల్ల అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమైంది. మోదీ ప్రభుత్వం మాత్రం ఎవరికీ అన్యాయం జరగదని, వారికి ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పింది.

## మీకు మహిళల ఉసురు తగులుతుంది

**- విపక్షాలపై అమిత్ షా ఫైర్**



**న్యూఢిల్లీ** మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీకి బిగ్ షాక్

**- ద్వంద్వ పౌరసత్వంపై కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశాలు**



**న్యూఢిల్లీ** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి, విచారణ జరపాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సూచించింది. లేదంటే ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న తన అభ్యర్థనను

2లో..

# సమ్మె విరమిస్తున్నాం..

**- ట్రాన్స్‌కో సీఎండీతో చర్చిస్తాం**

**భట్టి విక్రమార్కతో విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీశ్ రెడ్డి**



**హైదరాబాద్** ట్రాన్స్‌కో సీఎండీతో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది...వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు.

చర్చల్లో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు చుక్కెదురు

**- విపక్షాల తీరుపై చంద్రబాబు ఫైర్**



**అమరావతి** చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే కీలక బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు చారిత్రక తప్పిదానికి పాల్పడ్డాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే కాదని, పార్లమెంటులో సమాన ప్రాతినిధ్యం ఆశిస్తున్న లక్షలాది మంది మహిళలకు చేసిన ద్రోహమని ఆయన

2లో..

## కేటీఆర్ పాదయాత్ర ఇప్పుడెందుకు.?



**హైదరాబాద్** ఈనెల 25వ తేదీన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలపై సంచలన ఆరోపణలు చేశారు. పాదయాత్ర చేస్తానని ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 10 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని అప్పుడు చేయని పాదయాత్ర ఇప్పుడు ఎందుకు చేస్తానని కేటీఆర్ అంటున్నారని కవిత ప్రశ్నించారు. అధికారంలో ఉన్న 10 ఏళ్లు ఎందుకు ప్రజల్లోకి పోలేదని కేటీఆర్‌ను కవిత నిలదీశారు. ఇక హరీష్ రావు కుట్రలు చేస్తారని కవిత ఆరోపించారు.
ఇక తాను పెట్టనున్న కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులతో పాటు సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ

2లో..

## కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్లపై కమిటీ

**- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు**

**- కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ**

**- మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం**



**హైదరాబాద్** ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుండగా బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఖండిస్తోంది. ఈ క్రమంలోనే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు బ్యారేజీలు కుంగుబాటుకు గురి కావడంతో ఈ విమర్శలు తీవ్రం అయ్యాయి. మరోవైపు ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి అక్కడి పరిస్థితిని స్వయంగా సమీక్షించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దెబ్బతిన్న మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను పునరుద్ధరించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్యారేజీల మరమ్మతు పనులతోపాటు శాశ్వతంగా కనుగొనాల్సిన పరిష్కారాల కోసం కీలక కసరత్తు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పనుల సమన్వయం, పర్యవేక్షణ కోసం ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల,

2లో..

# ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి

## సర్పంచ్ నజియా అంజుమ్ షేక్ సోహైల్




జహీరాబాద్/ఝరాసంగం: ఏప్రిల్17 (తెలంగాణ వాణి ప్రతినిధి) పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ ఉందని సర్పంచ్ నజియా అంజుమ్ షేక్ సోహైల్ అన్నారు. శుక్రవారం ఝరాసంగం మండల పరిధిలోని తుమ్మన్ పల్లి గ్రామ పంచాయతీలో లబ్ధిదారులైన తలారి యశోద కి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కును సర్పంచ్ నజియా అంజుమ్ షేక్ సోహైల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖదీర్, హుస్సేన్, సలీం హాసన్ లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

# ధాన్యం, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ళ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, ఏప్రిల్ 17 : (తెలంగాణ వాణి ప్రతినిధి) రైతుల ప్రయోజనార్థం జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ, పసుపు, మొక్కజొన్న కొనుగోళ్ళ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ధాన్యం, మొక్కజొన్న, పసుపు విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462-220183 నెంబర్ కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతి రోజు ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు కంట్రోల్ రూమ్ లో అందుబాటులో ఉంటారని, రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, వరి ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ కోసం రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ లు 1967కు లేదా 18004250033 కు రైతులు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఏఎస్ఓ అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన



ఆదిలాబాద్ ( తెలంగాణ వాణి ప్రతినిధి ) తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ లో తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి డిసిసి కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా చట్టాలకు లోబడి పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఒక రాష్ట్రం ఏర్పడటాన్ని దేశ విభజనతో ముడిపెట్టి శత్రుదేశమైన పాకిస్థాన్ తో పోల్చడం క్షమించరాని నేరమని, ఇది దేశద్రోహానికి సమానమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల పోరాటం, వేలాది అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వి వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసిన ఎంపీపై వెంటనే చర్యలు తీసుకుని పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.

# రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

మందమర్రి టౌన్ (తెలంగాణ వాణి) రేపు పట్టణంలో ని తెలంగాణ మోడల్ పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించబడు నని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 వ తరగతి నుండి 10 వ తరగతి ప్రవేశ పరీక్ష లు ఈ ఏప్రిల్ 19 న ఆదివారం నిర్వహించబడుతాయని, 6వ తరగతి ఉదయం 10.గంటల నుండి మధ్యా హ్నం 12. వరకు,7వ తర గతి నుండి 10వ తరగతు లకు మధ్యాహ్నం 2.గంట ల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించ ను న్నట్లు తెలిపారు.

ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను elanganams.cgg.gov.in వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని, ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులు వారికి కేటా యించిన పరీక్ష కేంద్రం లో హాల్ టికెట్ చూపించి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని అన్నారు. పరీక్షలోని 100 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటా యని, సమాధానాలను ఓ ఎం ఆర్ షీట్లపై గుర్తించా లని సూచించారు. అభ్యర్థులు ఎగ్జామ్ ప్యాడ్, హాల్ టికెట్, బాల్ పెన్నులు,నీటి సీసా మిన హా మరే ఇతర సామాగ్రిని పరీక్షా హాలులోకి తీసుకు రావడానికి అనుమతిం చబడరని తెలిపారు.

# తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి

## ప్రతి నివాస ప్రాంతానికి శుద్ధి జలాలు సరఫరా జరగాలి

## అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) వేసవి సీజన్ దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా నిరంతరం పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని డొంకేశ్వర్, నందిపేట్, మాక్లూర్, ఆలూర్, ఆర్మూర్ మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓ లు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులతో కలెక్టర్ మంచినీటి సరఫరా తీరుతెన్నులపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.

ఒక్కో మండలంలోని ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతు పనులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వేసవిలో ఏయే ప్రాంతాలలో దాహార్తి సమస్యలు ఉత్పన్నం అయ్యాయని ఆరా తీశారు. ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల సరిపడా వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నందున, తాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని, చివరి ప్రాంతాలు, ఎత్తైన ప్రదేశాలలోని నివాసాలకు సైతం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగానే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని, సకాలంలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని అన్నారు. ఈ వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి నెలకొనకుండా అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా మంచినీటి కోసం ప్రజలు నిరసనకు దిగితే, సంబంధిత ఎం.పీ.డీ.ఓలను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులతో సమన్వయాన్ని పెంపొందించుకుని, ప్రతి గ్రామంలో, మున్సిపల్ వార్డులలో ప్రజల అవసరాలకు సరిపడా పూర్తి స్థాయిలో రక్షిత మంచినీటి సరఫరా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. చేతి పంపులు, బోరు బావులకు తక్షణమే ఫ్లషింగ్ చేయించాలని అన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థకు ఆటంకం కలిగేలా పైప్ లైన్లను ధ్వంసం చేయడం, వాల్వ్ లకు నష్టం చేకూర్చే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, ఎంపీఓలు, ఏ.ఈలు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ రాజేందర్, డీపీఓ శ్రీనివాస్ రావు, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్, మిషన్ భగీరథ ఈ.ఈ రాకేష్, నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఏ.ఈలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్" 5వ రోజు అవగాహన కార్యక్రమం




భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి) భైంసా పట్టణంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమం 5వ రోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ టి. సాయి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే "సువర్ణ సమయం" (గోల్డెన్ అవర్) ప్రాధాన్యతను వివరించి, అత్యవసర సేవల కోసం 100, 112 నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే హృదయ పునరుద్ధరణ (సీపీఆర్), ప్రాథమిక చికిత్స విధానాలపై శిక్షణ ఇచ్చారు. సీట్ బెల్ట్ వినియోగం, అధిక వేగం నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రత్యేకంగా సూచనలు చేశారు. రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటిస్తామని సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కాశీనాత్, విజయానంద్, ఫైర్ ఆఫీసర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టరేట్ కార్యాలయం వద్ద టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన,
- జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రెటరీ జనరల్ వనజ రెడ్డి,




మంచిర్యాల, ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి): రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజ రెడ్డి మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నాన్ గెజిటెడ్,గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక పెన్షనర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి అలాగే ఉద్యోగుల రెండో పీఆర్సి ని హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి కోరారు. పాత పెన్షన్ విధానాన్ని యథావిధిగా అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ కో- చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, భూముల రామ్మోహన్, శ్రావణ్ కుమార్, నాగుల గోపాల్, చక్రపాణి, శ్రీనివాసరావు, వేణుగోపాల్, సుమిత్, రమేష్, సునీత, దుర్గా ప్రసాద్, వైస్ చైర్మన్ లు రాజా,వేణు, మనోజ్ ,జయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటింపు మనందరి భాధ్యత



మందమర్రి టౌన్ ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి విలేకరి ) ట్రాఫిక్ నిబంధనల పాటిం పు మనందరి భాధ్యత అని ఓ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణం కోల్పోతుందని మంచిర్యాల డి సి పి భాస్కర్ పేర్కొన్నారు. మందమర్రి టోల్ ప్లాజా వద్ద రోడ్డు భద్రత, ప్రాణా లను కాపాడే గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, సి పి ఆర్ ప్రత్యేక శిక్షణ పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి మంచిర్యాల డీసీ పీ ఏ. భాస్కర్, వైద్యులు ముఖ్య అతిథిలు గా హాజరై, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల బాధ్య త పై సూచనలు చేశారు. వైద్య నిపుణులు సీపీఆర్ చేసే విధానాన్ని ప్రాక్టికల్గా చూపించి, ప్రజలకు, డ్రైవ ర్లకు శిక్షణ ఇచ్చారు. పలు వైద్య నిపుణులు ప్రమా దాల సమయంలో తీసు కోవాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో గాయ పడిన వారికి "గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే మొదటి ఒక గంటలో సరైన వైద్య సహాయం అందితే ప్రాణా లను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతా యని తెలిపారు. డ్రైవర్లు, ప్రయాణికులు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగాప్రమాదం జరిగినప్పుడు బాధితులను వెంటనే సమీప ఆసుపత్రికి తర లించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. డీసీపీ చేతుల మీదుగా రోడ్డు సైడ్ షాప్ కీపర్స్, డ్రైవర్స్ కి ఫస్ట్ ఏయిడ్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్ర మంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్స రమేష్, సర్కిల్ ఎస్ఐలు ఆంజనే యులు, గంగారాం, శ్రీధర్, నరేష్, వైద్యులు సిదార్థ్, శైలేష్ పాల్గొన్నారు.

# సవి జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలి :జిల్లా కలెక్టర్



మంచిర్యాల (తెలంగాణ వాణి) వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి మరింత పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం




మహాదేవపూర్ (తెలంగాణ వాణి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో గ్రామ సర్పంచి ఎల్పుల సరిత చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులకు, ప్రయాణికులకు నీటిని అందజేశారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచి తెలిపారు. వివిధ గ్రామాలకు వెళ్లే వారికి నీటి ఎద్దడి సమస్యను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, ఉపాధ్యాయులు సదయ్య, మాజీ సర్పంచ్ సునీత సురేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు సౌకర్యంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



మంచిర్యాల (తెలంగాణ వాణి) గోదావరి పుష్కరాలు-2027 లో భాగంగా భక్తులకు సౌకర్యవంతంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల పుష్కర్ ఘాట్ వద్ద భక్తులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను తహసీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పుష్కర్ ఘాట్‌కు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ సౌకర్యాలు విస్తరించాలని, వాహనాల రాకపోకలు సులభంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఘాట్ పరిసర ప్రాంతాలలో శుభ్రత, తాగునీరు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, దేవాలయ ప్రాంతాల్లో శుభ్రత, ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు.అనంతరం అక్కేపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. నర్సరీ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గోశాలలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో, సమయానికి పూర్తయ్యేలా పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో పిల్లలకు సరైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ. సి., సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆగారం గ్రామంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా '99 రోజుల ప్రణాళిక'ను చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఘనపూర్ మండలం ఆగారం గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రణాళిక పూర్తిగా పడకేసింది. గ్రామంలోని రోడ్ల పైన డ్రైనేజీ నీరు ప్రవహిస్తూ, చెత్తాచెదారం పేరుకుపోయి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా తాగునీటి పైపులు లీకేజీ కావడంతో డ్రైనేజీ నీరు, తాగునీరు ఒకే చోట కలిసి కలుషితమవుతున్నాయి. దీనివల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 15 నుండి 20 రోజులుగా సమస్య ఇలాగే ఉన్నా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని వారు మండిపడుతున్నారు. ప్రభుత్వం మంచి ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపడితే, గ్రామస్థాయి అధికారులు మాత్రం విధులను గాలికొదిలేశారు. అసలు ఈ ప్రణాళికలో ఆగారం గ్రామం ఉందా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించడంలో విఫలమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీపీఓ మరియు మండల స్థాయి అధికారులను గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాజకీయాల్లోనూ జనాభా దామాషా ప్రాతినిధ్యం కావాలి.

**- వనపర్తి ఎమ్మార్పీఎస్ నేతల డిమాండ్**




వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిది) తెలంగాణలో మాదిగ జనాభా అత్యధికంగా ఉన్నందున, ఆ జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ల వాటా కేటాయించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ డిమాండ్ చేశారు. వనపర్తిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదిక ద్వారా మందకృష్ణ మాదిగ గతంలో చెప్పినట్లుగా మాదిగల జనాభా అధికంగా ఉన్న విషయం రుజువైందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 9 శాతం రిజర్వేషన్‌ను సమర్థించడం సరికాదని, జనాభా లెక్కల ప్రకారం మాదిగలకు 10 నుండి 11 శాతం వరకు వాటా దక్కాలని ఆయన స్పష్టం చేశారు.?రాజకీయంగా కూడా మాదిగలకు అన్యాయం జరుగుతోందని, శాసనమండలితో పాటు లోక్‌సభ, రాజ్యసభలోనూ సరైన ప్రాతినిధ్యం కల్పించకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. విద్యా, ఉద్యోగ,సంక్షేమ రంగాలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లోనూ జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదే సమయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల ఉన్నత స్థాయి కమిటీలో మందకృష్ణ మాదిగకు సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్ఎఫ్ నాయకులు మీసాల నాగరాజు,గంధం గట్టయ్య,మొలకలపల్లి పరుషరాముడు తదితరులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# మహిళా పోలీసుల సాధికారతే లక్ష్యం

**- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి**




కరీంనగర్ (తెలంగాణ వాణి) పోలీసు శాఖలో మహిళల ప్రాతినిధ్యం పెంచి, వారిని శక్తివంతమైన నాయకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్న 'షీ లీడ్స్' మహిళా పోలీసుల ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత పోలీసు శాఖలో మహిళలకు సివిల్ విభాగంలో 33 శాతం, ఏఆర్ విభాగంలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. తెలంగాణలో ప్రారంభమైన 'షీ టీమ్స్' నమూనాను నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 'భరోసా' కేంద్రాల పనితీరును సుప్రీంకోర్టు సైతం అభినందించడం గర్వకారణమన్నారు. కరీంనగర్ సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. 'షీ లీడ్స్' ద్వారా మహిళా పోలీసులకు నాయకత్వ లక్షణాలు, సైబర్ క్రైమ్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ తో పాటు సీపీఆర్ నిర్వహణపై నిపుణులతో శిక్షణ ఇప్పించినట్లు వివరించారు. సిబ్బంది ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం 40 మంది బ్లూ కోల్ట్ సిబ్బందికి 20 స్కూటీలు, పెప్పర్ స్ప్రేలు, హాట్ బాక్సులను డీజీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థుల్లో సైబర్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణపై 'స్నేహిత' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ డీజీపీలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోడీ హటావో కిసానో కు బచావో

## యూత్ కాంగ్రెస్ చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలి




నర్సంపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో నర్సంపేట స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరవి పరమేష్ పటేల్ ,ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరవి పరమేష్ మాట్లాడుతూ...

అల్ ఇండియా యువజన కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు వరంగల్ జిల్లాలో కూడా 10 రోజుల కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్షలను విజయవంతంగా చేపట్టడం జరిగిందని, దీక్షకు సంపూర్ణంగా మద్దతు తెలిపిన ప్రతి ఒక్క యూత్ కాంగ్రెస్ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అన్నారు, అదే విధంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి నేతృత్వంలో 18న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహా ధర్నాలో నర్సంపేట నియోజకవర్గం నుండి అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు, కేంద్రంలోని మోడీ ప్రభుత్వము విదేశీ శక్తులకు తలొగ్గిన్న వ్యవసాయ రంగాని తాకట్టు పెడితే భారత్ దేశ రైతుల తరుపున కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడు రైతుల పక్షాన అండగా ఉండి న్యాయ పోరాటాలు చేపడతామని అన్నారు, అదే విధంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్ 18 తేదీ న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించే మహాధర్నాలో నియోజకవర్గ నుండి భారీగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా యూత్ కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు, దేశ ప్రధాని మోదీ తలవంచితే భారతదేశం తలవంచదని అన్నారు, రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వం రైతుల విషయంలో తీసుకొనే చర్యల వలన భారత్ దేశంలో వ్యవసాయ రంగం అధోగతి పాలు అవుతుంది అన్నారు భారత్ దేశంలోని ప్రతి రైతుకు గిట్టు బాటు ధర వచ్చేటట్లు పార్లమెంట్ లో చట్టం చేయాలనీ డిమాండ్ చేసారు, భారత్ దేశంలోని రైతులకు న్యాయం జరగని లబ్ది చేకూర్చని చట్టాలను మోడీ ప్రభుత్వం వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు, లేని పక్షంలో రైతులతో కలసి న్యాయ పోరాటాలు చేసి బిజెపి కేంద్ర ప్రభుత్వ తలవంచి గద్దె దింపుతామన్నారు ఇకనైనా యూస్ ట్రేడేడల్ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకొని మోడీ, ట్రంప్, అదానీ, గార్ల మధ్య కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, నల్లబెల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూరషోత్తం సురేష్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్, నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ సల్మాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు వనపర్తి శోభన్ కుమార్, లక్క విజేందర్, తడుగుల ప్రవీణ్, కొత్తగట్టు ప్రశాంత్, ఈశ్వర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు..

## ప్రజాపాలన-ప్రగతి కార్యక్రమం అమలుపై మండల స్థాయి సమీక్ష



హసన్ పర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సుమనా వాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు హాజరయ్యారు.సమావేశంలో గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు.తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్ శాఖల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు. వ్యవసాయ అధికారి అనురాధ రైతులకు పథకాలపై అవగాహన కల్పించి ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు.హౌసింగ్ ఏఈ లక్ష్మీపతి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించలేని వారికి కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు నిర్మించే అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖ ఏడీ అశోక్ ఇండ్లపై ఉన్న వైర్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జూనియర్ కళాశాల ఉపాధ్యాయుడు హరిప్రసాద్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరాలని విద్యార్థులను కోరగా, ఎస్సై సుజిత్ రెడ్డి రోడ్డు భద్రతపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని చెప్పారు. ఎపిఎం దాసరి నారాయణ మహిళా అభివృద్ధి కార్యక్రమాలు, ఆదాయ వనరులపై వివరించారు. ఈ సందర్భంగా కొందరు సర్పంచులు అభివృద్ధి పనుల అమలుపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపిఓ కరుణాకర్ రెడ్డి, ఈఈ ప్రవల్లిక, ఏఈ అనిల్ కుమార్ తదితర అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



వేములవాడ (తెలంగాణ వాణి ప్రతినిధి) వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని వేములవాడ మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం వారి దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, పాదచారులు, పట్టణ ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా మున్సిపల్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మరియు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక.!



కోహెడ (తెలంగాణ వాణి విలేకరి) సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామంలోని నూతన భవన నిర్మాణ కార్మిక సంఘం శుక్రవారం రోజున ఎన్నుకున్నారు. ఈ కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు కొండని బాబు, ఉపాధ్యక్షులు గాజుల బాబు, ప్రధాన కార్యదర్శి కొండని సతీష్, ప్రచార కార్యదర్శి చింతకింది కుమార్, కోశాధికారి వేల్పుల రవీందర్, కార్యవర్గ సభ్యులు కొండని రవి, లింగం, లింగయ్య, చంద్రయ్య, మల్లయ్య, బాలయ్య, రాజయ్య రాజయ్య, లింగయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని అన్నారు. అనంతరం అధ్యక్షులు కొండని బాబు మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులకు కార్మిక సంఘం అభివృద్ధి కోసం తనకున్న శక్తి సామర్థ్యం ఉన్నంత వరకు సహాయ సహకారం ఉంటుందని తెలిపారు.

# గురుకుల విద్యార్థులకు ఉపయోగపడని అత్యవసర హెచ్చరికలు



ధర్మారం :ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ) ఏప్రిల్ 19 నుండి మే 31 ఉదయం 10 నుండి మధ్యాహ్నం3 గంటల వరకు ఎవరు బయటకు ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదని పౌర రక్షణ విభాగం గత కొద్ది రోజులుగా ప్రజలను హెచ్చరిస్తుంది. గత నాలుగు రోజుల క్రితమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులలలో 6 నుండి 8 తరగతి విద్యార్థులు చివరి పరీక్షలు రాసి ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే క్రమంలో గురుకులాల సొసైటీ కార్యదర్శి నుండి అన్ని గురుకుల పాఠశాలలకు ఈనెల 21న కంప్యూటర్ ఎగ్జామ్ రాసి వెళ్లాలని సర్క్యులర్ జారీ చేశారు. ఈ సర్కులర్ తో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్ విద్యార్థులను ఇంటికి పంపించలేక వారిని గురుకులాలలోనే నాలుగు రోజులు అదనంగా ఉంచాల్సిన పరిస్థితి దాపురించింది. మరోపక్క పౌర రక్షణ విభాగం ప్రజలను చైతన్యవంతులను చేస్తూ రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ నుండి 55 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతాయని కొన్ని ప్రాంతాలలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే వేడి గాలులు ఉండే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు వాట్సాప్ గ్రూపులు. న్యూస్ పేపర్ టీవీ ఛానల్ లో వస్తున్నాయి. ఇలాంటి క్రిటికల్ పరిస్థితులలో కేవలం కంప్యూటర్ ఎగ్జామ్ కొరకు ఈనెల 21 వరకు గురుకులాలలో విద్యార్థులను ఉంచడం ప్రమాదకరమని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు సుంచు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని గురుకులాల కార్యదర్శి తో మాట్లాడి ఈ నెల 19న ఉదయం 10 గంటలకు విద్యార్థులను వారి ఇళ్లలోకి పంపించేందుకు సర్క్యులర్ ఇప్పించేందుకు చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని మల్లేశం కోరారు.

# ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



హుస్నాబాద్ (తెలంగాణ వాణి) హుస్నాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా ఎల్లమ్మ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ హమీద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి. మల్లికార్జున్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన చెరువు కట్ట వెంబడి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... చెరువు చుట్టూ నిర్మిస్తున్న నడక దారి, రక్షణ గోడ, పచ్చదనం పెంపొందించే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా, అన్ని హంగులతో ఈ చెరువును పర్యాటక కేంద్రంగా సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రధాన నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... హుస్నాబాద్ పట్టణ రూపురేఖలను మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎల్లమ్మ చెరువును స్థానికులకు ఒక చక్కని వినోద కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, వార్డు కౌన్సిలర్ భూక్యా సంపత్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల భారీ నిరసన**



రాజన్న సిరిసిల్ల (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ మరియు కో చైర్మన్ సమర్ సేన్ నేతృత్వంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పెండింగ్ బిల్లులు, పిఆర్సి అమలు మరియు హెల్త్ కార్డుల జారీ, పలు ఉద్యోగుల సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వవలసిన రెండో పిఆర్సిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డిఏలను తక్షణమే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం గనుక స్పందించకపోతే ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని మరియు హెల్త్ కార్డుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ జి.నగేష్ ని కలిసి ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్, టీజీఓ జిల్లా కార్యదర్శి సయ్యద్ జబీ, నాయకులు శ్రీకాంత్, రియాజ్, సాగర్ , వివిధ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎండా కాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకి జాగ్రత్తలు తెలియజేయాలి..

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల (తెలంగాణ వాణి) ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకి జాగ్రత్తలు తెలియజేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా...యువరైతు మృతి





చిగురుమామిడి (తెలంగాణ వాణి విలేఖరి) కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, వ్యవసాయ పొలం వద్ద వరి కోత ముగించుకొని ట్రాక్టర్లో వడ్లు తీసుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టి యువరైతు మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కుటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... లంబాడిపల్లి గ్రామానికి చెందిన కాటం కిషన్ రెడ్డి(28) అనే యువరైతు కొంత పొలం కోసుకొని కుంటకట్ట ఎక్కే సమయంలో ఒకసారి గా ట్రాక్టర్ వెనక్కి వస్తూ బోల్తా కొట్టిందని అక్కడికక్కడే కిషన్ రెడ్డి ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైరు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, సర్పంచ్ కాటం సంపత్ రెడ్డితోపాటు గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకి తీశారు. మృతుడి తండ్రి లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీదర్ గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య శృతి,తల్లిదండ్రులు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే కిషన్ రెడ్డి,హఠాత్తుగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో ఘటన స్థలానికి వచ్చిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సిపిఐ జిల్లా నాయకురాలు గూడెం లక్ష్మిలు కోరుతూ భాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వరి కోతలు కోస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వెళ్లాలని,ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఎస్సై పృధ్విధర్ గౌడ్ కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు సర్కారు కుట్ర!

**ఎస్ఎఫ్ఐ హుస్నాబాద్ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిది) పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని ఎస్ఎఫ్ఐ హుస్నాబాద్ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఆరోపించారు. శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేట్ విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించిన సమయంలో, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కౌంటర్ దాఖలు చేయలేదని లక్ష్మణ్ విమర్శించారు. సర్కారు వైఫల్యం వల్లే ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే పరిస్థితి నెలకొందని, ఇది పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి ఇంజినీరింగ్, ఫార్మా, మెడిసిన్ వంటి కోర్సులు చదువుతున్నారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం సుమారు పది వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టిందని, దీనివల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున విద్యార్థి ఉద్యమాలను చేపడతామని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, తిరుపతి, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ జుబేదా ఆధ్వర్యంలో ఫ్రీ స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



సైదాపూర్ (తెలంగాణ వాణి విలేకరి) సైదాపూర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో అంగన్వాడి సెంటర్లో టీచర్ జుబేదా ఆధ్వర్యంలో పోశక్ పక్వాడ ఇందులో భాగంగా ప్రీస్కూల్ మే వేళలో గ్రాడ్యుయేషన్ డే ప్రీస్కూల్ పిల్లలచే నాటకీకరణ కథ పాటలు పాడించడం జరిగినది అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు సంవత్సరం పాటు చదివిన చదువుకు గాను ప్రోగ్రెస్ కార్డు ఇవ్వడం జరిగింది అని అందులో పిల్లలు ఎంత బరువు ఉన్నారు అని ఎంత మెరుగైన చదువు చదివారు అని పోగ్రెస్ కార్డులు లో సంవత్సరములు సంవత్సరంలో ఏ కార్యక్రమాలు నిర్వహించారు మొదలైనవి పోకిరిస్ కార్డులో ఉంటాయి అని తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సిడిపిఓ సుగుణ, ఉప సర్పంచ్ దుస్స కుమార్, వార్డ్ మెంబర్లు హసీనా, వనిత, మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య, మాజీ ఎంపీటీసీ మండల కొమురయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపల్లి కిష్టయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, బత్తుల బాబు, బొలుమల్ల చందు, పిఎస్ హెచ్ఎం జీవిత, వెంకటరమణ, అంగన్వాడి టీచర్ ఎండి జుబేదా, మంజుల, రజిత,రమ, ఆయా సరూప నిర్మల ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమ్ రిజిస్ట్రేషన్ గురించి గ్రామ సంఘం వివోఏ లకు అవగాహన కల్పిస్తున్న ఏటీఎం రామ్ నారాయణ గౌడ్



నాగిరెడ్డి పేట మండలం ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి) నాగిరెడ్డిపేట మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా సమైఖ్య కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘం విఓఎలకు అవగాహన కార్యక్రమాన్ని ఏ పి ఎం నిర్వహించారు . ఈ అవగాహన కార్యక్రమంలో ఏపిఎం మాట్లాడూతూ ..ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనేది భారత ప్రభుత్వం ఎం ఎస్ ఎం ఈ లకు ఇచ్చే అధికారిక గుర్తింపు . చిన్న సూక్ష్మ మరియు మధ్య తరహా వ్యాపారులకు నమోదు చేయడానికి ఉపయోగపడుతుంది . ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి బ్యాంకు రుణాలు సులభంగా ఉండడానికి సబ్సిడీలు ప్రోత్సాహకాలు పొందడానికి వ్యాపార అభివృద్ధికి , చిరు వ్యాపారుల అభివృద్ధికి సహాయం కోసం ఉపయోగపడుతుంది . మహిళా సంఘాలు స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పారిశ్రామికవేత్తలు రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ద్వారా ఉచితంగా నమోదు చేయవచ్చు అని తెలిపారు . ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ నెంబర్ , మొబైల్ నెంబర్ అవసరమని తెలిపారు . నమోదు అనంతరం ఉద్యమ్ సర్టిఫికెట్ వస్తుంది. విఓఎ ల ద్వారా గ్రామస్థాయిలో మహిళా సంఘాలు మరియు చిన్న వ్యాపారస్తులకు ఈ రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించి ఉద్యమ్ రిజిస్టర్ చేయించాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల సమైఖ్య పాలకవర్గం సీసీలు వివిధ గ్రామాల విఓఎ లు పాల్గొన్నారు .

# రోడ్డు సేఫ్టీ భద్రత పై ప్రతిజ్ఞ



ధర్మారం (తెలంగాణ వాణి ) 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా స్థానిక ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ధర్మారం మండల కేంద్రంలో ఆటో టాక్సీ గూడ్స్ డ్రైవర్లకు రోడ్డు భద్రత సేఫ్టీ పై అవగాహన కల్పించారు. ప్రజలకు ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ హావర్ గురించి 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అనంతరం రోడ్డు సేఫ్టీ గురించి 108 సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

# ప్రజావాణి దరఖాస్తులపై అధికారులతో సమీక్ష: కలెక్టర్ చిత్ర మిశ్రా





కరీంనగర్ (తెలంగాణ వాణి) ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తుల స్థితిపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం కలెక్టర్ చిత్రమిశ్రా,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపాలిటీ, రెవెన్యూ,సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖ,విద్యుత్, వెటర్నరీ,పంచాయతీ తదితర శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులపై నిర్లక్ష్యం వహిం చొద్దని సూచించారు. సెక్షన్ల వారీగా దరఖాస్తులను విభజించి పరిష్కరించాలని పేర్కొన్నారు. తరచుగా ఫిర్యాదులు వచ్చే సమస్య లపై ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయి తనిఖీ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జెడ్పి సీఈఓ శ్రీనివాస్, విద్యుత్, నీటిపారుదల శాఖ,మున్సి పల్,విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఐజీపీ రమేష్ నాయుడు

వేములవాడ,ఏప్రిల్ 17 (తెలంగాణ వాణి ప్రతినిధి) వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర రైల్వే మరియు రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఐజీపీకి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనం అందజేశారు. ?ఈ కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఆర్.ఐ సురేష్, ఎస్సైలు పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రోటోకాల్ ఏఈఓ జి. అశోక్ కుమార్,ఆలయ పర్యవేక్షకులు ఎన్. రాజేందర్ మరియు ఇతర ఆలయ ఉద్యోగులు హాజరయ్యారు.



# విద్యార్థుల భవితవ్యానికి ఉపాధ్యాయులే పునాదులు

## ఆర్థిక భద్రత నేర్పించడం అభినందనీయం తహసిల్దార్ శేఖర్



జగిత్యాల/ వెల్గటూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) వెల్గటూర్ మండలంలోని పాశిగామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 28 మంది బాలికలకు ఉపాధ్యాయులు సంపత్ కుమార్, మహేష్ లు సొంతంగా 7500 విలువగల సుకన్య సమృద్ధి యోజన ఖాతాలనుతీసి, వారికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల తహసిల్దార్ శేఖర్ గారు మాట్లాడుతూ పాశిగామా పాఠశాలలో ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని, ప్రాథమిక దశలో విద్యార్థులకు ఆర్థిక భద్రత కలిగించే విధంగా ఖాతాలను అందజేయడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా వారిని అభినందించారు. మండల విద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులలో భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా ఈ ఖాతాలు ఉపయోగపడతాయని తెలియజేస్తూ ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సంపత్ మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మహిళలపై కీలక పాత్ర కావున సామాజిక బాధ్యతగా పాఠశాలలో చదివే విద్యార్థులకు సుకన్య ఖాతాలను అందజేయడం జరిగిందని భవిష్యత్తులో వాటిని ఉన్నత చదువులకు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సబ్ పోస్ట్ మాస్టర్, తపాలా సిబ్బంది మరియు గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శేఖర్ , ఎంఈఓ ప్రభాకర్ , సర్పంచ్ కాంద్రపు శిరీష, ఉప సర్పంచ్ కొత్తూరు భూమయ్య ,పాఠశాల బృందం సంపత్ ,మహేష్ ,ప్రణీత,రజిత, ప్రవళిక, సబ్ పోస్ట్ మాస్టర్ కమలాకర్, మౌనిక, సుధాకర్ ,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, రోజువారీగా ఆసుపత్రుల్లో సగటున నమోదవుతున్న ఓపి లు, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోకి వైద్యం కోసం వచ్చే రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆసుపత్రులలో అవసరమైన మందులు అవసరాన్ని బట్టి ఇండెంట్ పెట్టి సమకూర్చుకోవాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే జనాలకు వివిధ విభాగాల సమాచారం తెలిసేలా బోర్డులు ఖచ్చితంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుదల కొరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై ఎస్సై ముప్పు సురేష్ అవగాహన




మొగుళ్ళపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) గుండెపోటు నివారించేందుకు ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహన అవసరమని కార్యక్రమంలో భాగంగా మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్ ఆధ్వర్యంలో.. శుక్రవారం సిపిఆర్ పై మొగళ్లపల్లి మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే సిపిఆర్ పై ప్రజలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ సదస్సులో వైద్య నిపుణులు చేరవేసే క్రమంలో అప్రమత్తత వహించాల్సిన చిట్కాల గురించి తెలిపారు. మరియు గుండెపోటు మరియు అస్తవ్యస్త ఆగిపోయిన సందర్భాల్లో వెంటనే ఎలా స్పందించాలి, ఛాతిపై ఒత్తిళ్లు ఎలా ఇవ్వాలి, శ్వాస అందించే విధానం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. అత్యవసర సమయాల్లో మొదటి కొన్ని నిమిషాలు ఎంత కీలకమో, సకాలంలో సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాలను ఎలా కాపాడవచ్చో వివరించారు. నిత్య జీవితంలో తరచుగా ప్రమాదాలు, గుండెపోటు వంటి ఘటనలతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. కావున ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండడం ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. ముందు చేరే ప్రజల స్పందించి సిపిఆర్ ద్వారా ప్రజల ప్రాణాలను రక్షించవచ్చని ఎస్సై సురేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అరుణ్ కుమార్ హోంగార్డు రవికుమార్ మెడికల్ సిబ్బంది ఈఎంటి మూగల రాజు 108 పైలెట్ కట్కూరి శ్రీనివాస్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## - రహదారి నిబంధనలే రక్షాకవచం - రాష్ట్ర రైల్వే,రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు




రాజన్న సిరిసిల్ల (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని,వారు పాటించే రహదారి నిబంధనలే వారి ప్రాణాలకు నిజమైన రక్షాకవచాలని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి.గితే హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైల్వే,రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను కాపాడే తొలి వ్యక్తులు డ్రైవర్లేనని, వారు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు, బస్సులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, విద్యార్థుల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ 'రహవీర్' పథకం ప్రవేశపెట్టినదని, ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను ఆసుపత్రికి చేర్పిన వారికి రూ. 25,000 ప్రోత్సాహకం అందిస్తామని, అలాగే బాధితులకు వారం రోజుల పాటు రూ. 1,50,000 వరకు ఉచిత వైద్య సాయం అందుతుందని అన్నారు. తెలంగాణలో ప్రతిరోజూ సగటున 70 ప్రమాదాలు జరుగుతున్నాయని,అందులో 20 మంది మరణిస్తుండటం విచారకరమని,ఓవర్ స్పీడ్,రాంగ్ ఓవర్ టేకింగ్ వంటివే వీటికి ప్రధాన కారణమని అన్నారు కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ యుద్ధాలు లేదా వ్యాధుల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే దేశంలో అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దేశవ్యాప్తంగా జరిగిన 4.70 లక్షల ప్రమాదాల్లో 1.70 లక్షల మంది మృతి చెందారని తెలిపారు. ప్రతి డ్రైవర్ తమ కుటుంబ బాధ్యతను గుర్తుంచుకొని వాహనాలు నడపాలని కోరారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, సైన్ బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మార్చి 6న ప్రారంభమైన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం, వైద్య ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని అన్నారు.ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. జిల్లాలో కొదురుపాక బ్రిడ్జ్, నందికమాన్, తిప్పాపూర్ బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పెద్దూర్, ఎల్లారెడ్డిపేట హెచ్‌పీ బంక్, పద్మనగర్, సారంపల్లి వంటి ఎనిమిది ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులందరూ వాహన డ్రైవర్లతో కలిసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్,సీ.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మధుకర్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్, ఎస్.ఐ లు, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక డిమాండ్ల పరిష్కారించాలి

చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా మండల ఇంచార్జ్ దాసరి జానయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో చౌటుప్పల్ కి వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక ఆర్డీవో కు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్ంలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం తో చర్చలు జరిపిన సందర్భంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన 64 డిమాండ్లను వెంటనే పరిష్కరించి ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మికులకు మేలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, పి.ఎస్.హెచ్. ఎం అసోసియేషన్ ప్రెసిడెంట్ మేడి యాదయ్య , ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఐ. శ్రీనివాస్, పి ఆర్ టి యు జిల్లా నాయకులు నిరంజన్ రెడ్డి , టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు మమత మేడం, జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి డీటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు శారద,నాయకులు యాదయ్య, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# దివ్యాంగులకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

## వనపర్తి సన్నాహక సదస్సులో ఎన్పిఆర్డి ఇండియా జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్ డిమాండ్

వనపర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) దేశంలో త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో దివ్యాంగులకు చట్టసభల్లో (ఎంపి, ఎమ్మెల్యే స్థానాల్లో) 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎన్పిఆర్డి ఇండియా జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శు క్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ యాదవ భవన్‌లో నిర్వహించిన లక్ష మంది దివ్యాంగుల "ఆత్మగౌరవ బహిరంగ సభ" భారీ సన్నాహక సదస్సుకు సదస్సుకు జిల్లా అధ్యక్షులు చింతకుంట మధు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగాతుడుం రాజేందర్ హాజరై మాట్లాడుతూ దివ్యాంగులు కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, రాజకీయ నిర్ణయాధికారంలోభాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. రాజకీయ వాటా ఖచ్చితంగా ఇవ్వాలని, కొత్త నియోజకవర్గాల ఏర్పాటులో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎన్పిఅర్డి ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దైనంపల్లి మల్లికార్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరిలు మాట్లాడుతూ శారీరక దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలురాక అరిగోస పడుతున్నారని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శారీరక దివ్యాంగులకు 'మొదటి రోస్టర్ పాయింట్' కేటాయించాలని డిమాండ్ చేశారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ. 15,000, సాధారణ దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 6,000 పెన్షన్‌ను తక్షణమే ఇవ్వాలని కోరారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాజశేఖర్ , రాష్ట్ర నాయకులు కాసా ప్రవీణ్ లు మాట్లాడుతూ

ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని చాటేలా త్వరలో జరగబోయే బహిరంగ సభను దిగ్విజయం చేయాలని వారు పిలుపునిచ్చారు మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు టి మధుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్ సీనియర్ నాయకులు ఎం శ్రీనివాస్, విజయ్ , వెంకటయ్య కావాలి మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, సుశీల , మహేశ్వరి, రామ్ లీ , గోవిందమ్మ, రాజు, రామకృష్ణ, శాంతమ్మలతో పాటు జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు పెద్దఎత్తున తరలివచ్చారు.



తెలంగాణ వాణి


# టెండర్లు లేకుండా గ్రౌండ్ పనులు ఎలా జరిపిస్తారు?.

**శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో వివాదం**

**కోర్ట్ ధిక్కార పనులు చేయిస్తున్న రవీంద్ర కుమార్**

**సమగ్ర విచారణకు వైఎఫ్ డిఆర్ సంస్థ చైర్మన్ బేబీ డిమాండ్**



కొత్తగూడెం / శ్రీశైలం (తెలంగాణ వాణి) నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో టెండర్లు లేకుండా గ్రౌండ్ పనులు చేపట్టడం తీవ్ర వివాదానికి దారి తీస్తోంది. నాగర్ కర్నూల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో ఉన్న కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన వివాదం విచారణలో ఉండగానే, ఎస్ఈ రవీంద్ర కుమార్ అధికారాన్ని వినియోగిస్తూ గ్రౌండ్ పనులను తిరిగి ప్రారంభించినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం వెలుగులోకి వచ్చింది. కోర్టు పరిధిలో ఉన్న పనులను ఇలా కొనసాగించడం పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఎస్ఈ రవీంద్ర కుమార్ పై గతంలోఅనేక ఆరోపణలు కూడా వచ్చిన విషయం తెలిసిందే.

ఆ ఆరోపణలు సంబంధిత ఫైల్స్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు వరకు వెళ్లినప్పటికీ, ఇంకా విచారణ దశలోనే ఉన్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ ఆయనపై కొత్తగా ఆరోపణలు రావడం ప్రాధాన్యత సంతరించుకుందని విశ్వసనీయ సమాచారం. కింద స్థాయి అధికారులపై చర్యలు తీసుకున్నప్పుడు కొద్ది రోజులు ఆగి, మళ్లీ మామూలుగా అధికారాన్ని వినియోగిస్తూ పనులు కొనసాగిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా కోర్టు పరిధిలో ఉన్న గ్రౌండ్ కాంట్రాక్ట్ పనులను ఎస్ఈ రవీంద్ర కుమార్ స్వయంగా చేయిస్తున్నట్లు విశ్వసినియంగా తెలుస్తోంది. ఈ పనులు శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఏఈ రామ్మోహన్, ప్లాంట్ అటెండెంట్ వంశీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. టెండర్ ప్రక్రియ ద్వారా చేయాల్సిన ఈ పనులను అధికార ప్రభావంతో నేరుగా చేపట్టడం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా, కొందరు నిరుద్యోగ యువకులను ఆశ చూపించి వారితో ఈ పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఉపయోగించుకొని గ్రౌండ్ పనులు నిర్వహించడమే కాకుండా, విలువైన సామాగ్రిని కూడా బయటకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం 5 గంటల సమయంలో మొదలు పెట్టి 7 గంటల వరకు చేయటం, తర్వాత చీకటి సమయంలో ఈ పనులు జరగడం అనుమానాలకు తావిస్తోంది. శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉండే పరిస్థితుల్లో, ప్లాంట్ లోపలికి వెళ్లడం చాలా కఠినమైన ప్రక్రియ.

అయినప్పటికీ, ఇంత మంది యువకులు సమయం కాని సమయాల్లో లోపలికి వెళ్లి గ్రౌండ్ పనులు చేయడం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సెక్యూరిటీ సిబ్బంది దీనిపై మౌనం పాటించడం కూడా అనుమానాలకు దారితీస్తోంది. ఈ పనులకు ఎవరు అనుమతి ఇచ్చారు? డబ్బులు ఎవరు ఇచ్చారు? అనే ప్రశ్నలు కార్మికులు, ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక, వాటర్ ట్యాంక్, షిఫ్టింగ్ డివిజనల్ ఇంజనీర్ కంట్రోల్ లో ఉంటదని తెలుస్తోంది. మరి శ్రీశైలం జల విద్యుత్తు కేంద్రం లో ఉన్న ఒకే ఒక్క వాటర్ ట్యాంక్ ని ఈ ప్రైవేట్ గ్రౌండ్ పనులుకు అధికారులు ఉపయోగించటం కార్మికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఒక్క వాటర్ ట్యాంక్ ను ప్రైవేట్ కాంట్రాక్ట్ పనులకు ఎలా అనుమతి ఇచ్చారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇప్పటికైనా శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని ఉద్యోగులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ గ్రౌండ్ వివాదాన్ని గౌరవిస్తూ పనులను తక్షణమే నిలిపివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వై ఎఫ్ డి ఆర్ సమస్త చైర్మన్ బేబీ కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఘనంగా సన్మానం!



వికారాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) వికారాబాద్ జిల్లా దోమ మండలం కిష్టాపూర్ గ్రామంలో మాతృభూమి అభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మా జ్యోతిబా ఫూలే మునిమనవరాలు శ్రీమతి నీతా ఫూలే హాజరయ్యారు. సంస్థ చైర్మన్ మరియు బీఎంపీ పరిగి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పాత్లావత్ గట్ట్యా నాయక్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ?ఈ సందర్భంగా నీతా ఫూలే మాట్లాడుతూ ఫూలే, అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం గట్ట్యా నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఆనంద్ గౌడ్, పలువురు ఉద్యమకారులు మరియు మాతృభూమి అభివృద్ధి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన టీజేఏసీ

**నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి ) పెండింగ్లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ( టీజీజేఏసీ ) పిలుపుమేరకు కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు విధులు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం భోజన విరామ సమయం మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెసా డివిజన్ అధ్యక్షుడు షేక్ అంజాద్ పాషా, డిప్యూటీ తహసీల్దార్, తాలూకా విశ్రాంతి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు రాములు, కార్యదర్శి ఐ ఎం భాస్కర్, జక్కుల రవి కుమార్, నరసింహరావు , రెవెన్యూ సిబ్బంది సూర్యనారాయణ, ధవళ రాజు మొదలగు వారు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న లక్ష రూపాయలు నగదు సొమ్మును

# ఇచ్చినిజాయితీని చాటుకున్న అర్చకులు సాయిరాం

## – అర్చకులు సాయిరాం నిజాయితీ



**నందిగామ** డబ్బులు, విలువైన వస్తువులు దొరికితే తమ సొంతం చేసుకుంటారుగానీ, పోగొట్టుకున్న వ్యక్తులకు వాటిని అప్పగించాలని ఆలోచించరు. వాటిని చూడగానే మనిషి ప్రవర్తన మారిపోతుంది. కానీ, కొందరు మాత్రం తమది కానిది ఒక్క రూపాయి కూడా ఆయాచితంగా తీసుకోడానికి ఇష్టపడరు. పరుల సొమ్ముకు ఆశపడకుండా ఆత్మాభిమానంతో ఉంటారు. తాజాగా, అలాంటి సంఘటన గురువారం సాయంత్రం నందిగామ శివారు గ్రామీణ ప్రాంతంలో చోటుచేసుకుంది నందిగామ మండలం రాగాపురం నివాసి రుద్రవరం గొర్రెలు కొనడానికి వెళ్లి వస్తూ ఉండగా లక్ష రూపాయల బ్యాగును పోగొట్టుకున్నాడు. ఇంటికి వెళ్లి బ్యాగు లేకపోయేసరికి ఎక్కడ పోగొట్టుకున్నాడో తెలియక బాధపడుతూ ఉన్నాడు. కానీ ఆ రాత్రి ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం గొల్లమూడి శివాలయంలో ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న తొర్లపాటి సాయిరాం కు లక్ష రూపాయలు బ్యాగు రోడ్డుపై దొరికింది. వెంటనే అర్చకులు సాయిరాం గొల్లమూడి శివాలయం గ్రూపులో ఈ సమాచారాన్ని అందించారు సమాచారం తెలుసుకున్న బాధితులు గొల్లమూడి శివాలయం అర్చకుల్ని సంప్రదించారు. శుక్రవారం ఉదయం నందిగామ వినాయకుడి గుడి అర్చకులు ప్రధాన అర్చకులు ఐతపు రఘు శర్మ బాధితులని నందిగామకు పిలిపించి నందిగామ పట్టణ సిఐ ను సంప్రదించి పూర్తి వివరాలు తెలపగా పట్టణ సీఐ ఆదేశాల మేరకు నందిగామ వినాయకుడు ఆలయంలో చైర్మన్ తిరుపతిరావు ఆధ్వర్యంలో గొల్లమూడి శివాలయం ప్రధాన అర్చకులు చేతుల మీదుగా పోగొట్టుకున్న సొమ్ము నగదు 1 లక్ష రూపాయలు రాఘవపురం నివాసి అయిన వరదబోయిన మురళీకృష్ణ కు అప్పగించారు. పోయిందనుకున్నా లక్ష రూపాయలు సొమ్ము తిరిగి వచ్చేసరికి అర్చకులు సాయిరాం నిజాయితీకి ఫిదా అయ్యాడు. నందిగామ పాత బస్టాండ్ వినాయకుడి గుడి ఆలయంలో భక్తులంతా సన్నివేశాన్ని చూసి సాయిరాం నిజాయితీకి ప్రశంసలు కురిపించారు.

## బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుపై హర్షం**

**స్వచ్ఛమైన రాజకీయాలకు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది**

**బాణాసంచా పేలుస్తూ బిజెపి సంబరాలు**

**మహిళా కన్వీనర్ గాయత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి మహిళా మోర్చ ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని పాత ఆర్టీసీ డిపో సెంటర్ నుండి ఎంజీ రోడ్డు మీదుగా గణేష్ టెంపుల్ సెంటర్, రైతు బజార్ మీదుగా సింగరేణి సూపర్ బజార్ సెంటర్లో గల రైల్వే స్టేషన్ సెంటర్ కు చేరింది. బిజెపి జిందాబాద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు నాయకత్వం జిందాబాద్ అంటూ బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైల్వే స్టేషన్ సెంటర్కు చేరిన బిజెపి శ్రేణులు మహిళా కన్వీనర్ గాయత్రి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది జీవీకే మనోహర్ రావుఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బీజేపీ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి,మహిళా ర్యాలీ కన్వీనర్ సముద్రాల గాయత్రి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33% కోటాను కల్పించే చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య పట్ల హక్షం వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని 2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు సంబంధించి ఇదే చట్టాన్ని సవరించాలని పార్లమెంటులో చర్చ జరుగుతున్న సమయంలో నోట్ పై జరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ ముందు నుంచి మహిళలకు రాజకీయాల్లోనూ, ఇతర కార్యకలాపాల్లోను మహిళలకు ప్రాధాన్యతని ఇస్తుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు రాష్ట్రాల్లోని అసెంబ్లీలో కూడా ఎమ్మెల్యే సీట్లను పెంచి ఆయా అసెంబ్లీలో కూడా మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ర్యాలీ అనంతం రాళ్యాలిలో పాల్గొన్న మహిళలు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బలగం శ్రేదర్,దురిశెట్టికుమార్ జె. వెంకట్, రాకేష్,బి. చిన్న, విఠల్, రామారావు, నవీన్, సునీత, లక్ష్మి, సుప్రజ, భవాని, లీలా, సరోజ,సరళ ఫాతిమా,షాహిన్, తదితరులు పాల్గొన్నారు.

# వరసిద్ధి వినాయక దేవస్థానంలో దొంగల దోపిడి

## – లక్షన్నర రూపాయల నగదు చోరీ.



**ఒంగోలు** స్థానిక సీతారామపురం, ఉత్తరము వైపునుండి శ్రీగిరి స్కందగిరి వెళ్ళే మార్గం మొదలులో... శ్రీగిరి పై ఉన్న జేసీ గృహమునకు కూతవేటు దూరములో ఉన్న, శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో శుక్రవారము (ఏప్రిల్ 17 తేదీ) వేకువన దొంగలు పడి సుమారు ఒకటిన్నర లక్షల రూపాయలు దోచుకున్నారు.?

అక్కడికి దగ్గరలో ఉన్న వేప అంకమ్మ తల్లి దేవస్థానంలో కూడా దోచుకోవడానికి దొంగలు ప్రయత్నించారని అక్కడ ఉన్న కొన్ని ఆధారాలను బట్టి తెలిసింది. స్థానిక భక్తులు ప్రజలు తెలిపిన విధంగా శుక్రవారం వేకువన మూడు గంటల సమయంలో దొంగలు ఆలయ హుండీని తెరచి సుమారు హుండీలో ఉన్న ఒకటిన్నర లక్షల రూపాయలను దోచుకోవడం జరిగిందని, ఈ ఆలయం దాదాపుగా 70 సంవత్సరాలుగా అలారారుచున్నదని, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలందరూ ఎంతో మతసామరస్యంతో పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వినాయక చవితి పర్వదినం నాడు ఎంతో శోభాయమానంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి గణపతి నవరాత్రి ఉత్సవాల సమయంలో ఈ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని హుండీని తెరచి భక్తులు వేసిన కానుకలను భక్తుల సహకారంతో ఎంతో వైభవంగా ఆలయ కేంద్రంగా గణపతి నవరాత్రులు నిర్వహించడం జరుగుతుందని, గత 8 నెలలుగా హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు సుమారు ఒకటిన్నర లక్షల రూపాయలు ఉంటాయని వాటన్నిటిని దొంగలు దోచుకుపోవడం జరిగిందని, ఈ ప్రదేశంలో దాదాపు రాత్రి 1:00 వరకు ప్రజల సంచారం ఉంటుందని ఈ దొంగతనం ఒకటి తరువాత జరిగి ఉంటుందని తెలిపారు. ఈ సీతారాంపురం పరిధిలో సీసీ కెమెరాలు లేకపోవడం మరియు పోలీస్ గస్తీ తక్కువగా ఉండటం వలన దొంగలకు ఈ ఆలయ హుండీ దోచుకోవడం సులభమైనదని కనుక సీసీ కెమెరాలు ఏర్పాటు, పకడ్బందీగా పోలీస్ గస్తీ ఏర్పాటు చేయడంతో ఈ సీతారాంపురం పరిధి రక్షణ పరంగా బలీయంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా హిందూ ఆలయాలను దోచుకోవడం పరిపాటిగా మారిందని కనుక పోలీస్ శాఖ ఈ దొంగలను పట్టుకొని శిక్షించాలని హిందూ ఆలయాల రక్షణకు, హిందువుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండడానికి తగిన విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సీతారాంపురం ప్రజలు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి భక్తులు కోరుచున్నారు.

# జనగణన శిక్షణ ఏర్పాట్ల పరిశీలన

**రాయికల్:** ఈ నెల 18 వ తేదీ నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లకు మరియు సూపర్ వైజర్లకు మొదటి విడతలో భాగంగా మే 11వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టే ఇండ్ల గణనపై నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను తహసీల్దార్ నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ మండలానికి సంబంధించి 81 మంది ఎన్యూమరేటర్లు,13 సూపర్ వైజర్లకు మూడు దశలుగా (18-29 ఏప్రిల్) అందించే శిక్షణలో జనగణనకు చెందిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని,శిక్షణను విజయవంతం చేయాలని,ప్రజా ప్రతినిధులు గ్రామాల్లోని ప్రతి ఇంటి వివరాలను నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ ట్రైనర్ కడకుంట్ల అభయ్ రాజ్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గట్టు రమేష్ నర్సయ్య,ఉపాధ్యాయులు మహేశ్వర శర్మ,తరంగిణి,పుర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# 'సుయోధన' మూవీ రివ్యూ!



ప్రియదర్శి కథానాయకుడిగా విభిన్నమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటూ వెళుతున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే 'సుయోధన'. సాయికుమార్ .. ప్రేమ కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, వైఎస్ మాధవరెడ్డి దర్శకత్వం వహించాడు. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు నుంచే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. వరుణ్ (ప్రియదర్శి) హైదరాబాదులో సినిమాలకి సౌండ్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేస్తుంటాడు. అతనికంటూ ఒక సొంత స్టూడియో ఉంటుంది. చిన్నప్పటి నుంచి వరుణ్ ని ఒక సమస్య వేధిస్తుంటుంది. 'సుయోధన' అంటూ ఎవరో తనని పిలుస్తున్నట్టుగా అతనికి ఒక వాయిస్ వినిపిస్తూ ఉంటుంది. అలా ఎందుకు జరుగుతుందనేది తెలుసుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. వరుణ్ తండ్రి ప్రకాశ్ (సాయికుమార్) రాజకీయనాయకుడిగా బిజీగా ఉంటాడు. భార్య రాధ (రాజశ్రీ నాయర్) అతనికి రాజకీయాలలో సూచనలు .. సలహాలు ఇస్తుంటుంది. ఒక రోజున వరుణ్ కి 'సంహిత' తారసపడుతుంది. డెమో ఫిల్మ్ చేయాలనుకున్న సంహిత, అతని హెల్ప్ కోరుతుంది. అప్పటి నుంచి వాళ్ల పరిచయం ప్రేమగా మారుతుంది. చాలా కాలం క్రితం 'వరలక్ష్మి' అనే ఒక నర్స్, మహతి అనే ఒక యువతిని గురించి రాసుకున్న 'డైరీ' ఆధారంగా తాను డెమో ఫిల్మ్ షూట్ చేస్తున్నట్టు వరుణ్ తో సంహిత చెబుతుంది. మహతి (ప్రేమ) అనే ఒక యువతి తన భర్త చేతిలో మరణిస్తూ, చివరి నిమిషంలో తన బిడ్డను కాపాడుతుంది. ఆమె త్యాగం వరుణ్ మనసును కదిలించివేస్తుంది. మహతి ఎవరు? భర్త చేతిలో ఆమె ఎందుకు చనిపోయింది? అనే విషయాలు తెలుసుకోవాలని అతను నిర్ణయించుకుంటాడు. అందుకోసం రంగంలోకి దిగిన వరుణ్ పై, కొంతమంది ఆగంతకులు ఎటాక్ చేస్తారు. మహతి ఎవరు? ఆమె కథతో వరుణ్ కి గల సంబంధం ఏమిటి? అతనిపై దాడి చేయించింది ఎవరు? అతనికి తెలిసే వేదు నిజాలేమిటి? అనేది మిగతా కథ. జీవితంలో కొన్ని అంశాలు ఆసక్తికరంగా .. మనసును కదిలించేలా అనిపిస్తాయి. అలాంటి సంఘటనలను గురించిన నిజానిజాలు తెలుసుకోవాలనే కుతూహలం కూడా కలుగుతూ ఉంటుంది.

ఆ దిశగా అడుగులు వేయడం మొదలుపెట్టినప్పుడు తెలిసే నిజాలు నివ్వెరపోయేలా చేస్తుంటాయి. అలాంటి ఒక పరిస్థితి ఈ సినిమాలో హీరోకి ఎదురైతే, అప్పుడతను ఏం చేశాడనే అంశం చుట్టూ ఈ కథ అల్లుకున్నారు. ఒక వైపు నుంచి సిన్సియర్ గా హీరో అన్వేషణ సాగుతూ ఉంటుంది. మరో వైపు నుంచి అతని మార్గానికి అవరోధాలు ఎదురవుతూ ఉంటాయి. రాజకీయాలు .. రౌడీ గ్యాంగులు .. పోలీస్ అధికారులు అతని ట్రాక్ ను టచ్ చేస్తూ ఉంటారు. అడపాదడపా డాక్టర్ల హడావిడి కూడా ఉండనే ఉంటుంది. హీరో వాటన్నింటినీ దాటుకుంటూ వెళుతున్న తీరును ఉత్కంఠ భరితంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. 'సుయోధన' అనే టైటిల్ వినగానే, ఇందులో సుయోధనుడిగా సాయికుమార్ ఏకపాత్రాభినయం .. భారీ డైలాగులు ఉంటాయని ప్రేక్షకులు అనుకోవడం సహజం. సరిగ్గా అలాంటి ఒక స్టేజ్ షోతోనే ఈ సినిమాను మొదలుపెట్టారు. సుయోధనుడి పాత్రతో ఈ కథకి సంబంధం ఉండటం వలన, ఆ టైటిల్ ను సెట్ చేసినట్టుగా మనకి అర్థమైపోతుంది. అర్థమయ్యేలా చెప్పారు కూడా. ఈ కథలో సస్పెన్స్ .. యాక్షన్ .. ఎమోషన్ .. ట్విస్టులు పలకరిస్తూ వెళుతుంటాయి. లవ్ ట్రాక్ కూడా ఉంది. కానీ ఎందుకనో దర్శకుడు ఆ వైపు పెద్దగా దృష్టి పెట్టలేదు. అందువలన హీరోయిన్ ఉందా అంటే ఉంది అంతే అనేట్టుగానే అప్పుడప్పుడు మాత్రమే తెరపై కనిపించడం జరుగుతుంది. ఇక ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ లో నాటకీయ పరిణామాలు మామూలే. ఈ కథలో హీరో తనకి కావలసిన సమాచారం కోసం పట్టువదలని విక్రమార్కుడి మాదిరిగా ముందుకు వెళుతుంటాడు. అయితే ముందు జరగబోయే కథను అప్పటికే గెస్ చేసిన ప్రేక్షకులు, అచ్చు అలాగే జరుగుతూ ఉండటంతో తాపీగా అలా కూర్చుండిపోయి చూస్తుంటారు అంతే. అసలు ఏం జరిగి ఉంటుందనేది తెరపై హీరోకంటే ముందుగానే ఆడియన్స్ పసిగట్టగలిగేలా ఉండటమే ఈ కథాకథనాలలోని ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. ప్రియదర్శి తన మార్క్ నటన కనబరిచాడు. హీరోయిన్ గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. సాయికుమార్ .. ప్రేమ .. రాజశ్రీ నాయర్ .. దేవీప్రసాద్ .. ఇలా మంచి సీనియర్ ఆర్టిస్టులే ఉన్నారు. ఎవరికి వారు పాత్ర పరిధిలో మెప్పిస్తూనే వెళ్లారు. కార్తీక్ కొప్పర ఫొటోగ్రఫీ .. జయ్ క్రిష్ నేపథ్య సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ ఓకే.

# పాటల సందడిలో లెనిన్



అక్కినేని అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో బలమైన సామాజికాంశాలను చర్చిస్తూ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. మురళీకృష్ణ అబ్బూరు దర్శకుడు. జూన్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో గురువారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతూ 'ఎట్టా ఎట్టా..' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించారు. సింగర్ శ్రీకృష్ణతో కలిసి తమన్ ఈ గీతాన్ని ఆలపించారు. మాస్ మెలోడీగా సాగిన ఈ పాటలో నాయకానాయికలు అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, దర్శకత్వం: మురళీ కిశోర్ అబ్బూరు.

# నీ గడుసుతనం అందరికీ తెలిసిందే..



అగ్ర కథానాయిక సమంత నటిస్తూ, స్వీయ నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకురాలు. మే 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం 'తస్సాదియ్యా' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ గీతానికి రెహమాన్ సాహిత్యాన్నందించారు. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ ఆలపించారు. ఈ పాటలో సమంత ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్‌తో హుషారుగా కనిపించింది. 'రెండు జళ్ల ఓ మొలకా పెళ్లి కూతురువైపోయావే.. అయినా ఇంకేం మారలేదే అట్టాగే ఉన్నావు.. నువ్వు నీ గడసుతనం అందరికీ తెలిసిందిలే..' అంటూ పెళ్లి నేపథ్యంలో ఆహ్లాదభరితంగా సాగిందీ పాట. కుటుంబమంతా ఆస్వాదించే ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు. దిగ్నాథ్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, నిర్మాతలు: సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు, దర్శకత్వం: నందినీ రెడ్డి.

# 'పాపం ప్రతాప్' మూవీ రివ్యూ



విభిన్నమైన కథలతో సినిమాలు చేసే హీరోల్లో తిరువీర్ ఒకరు. ఇటీవల 'ది గ్రేట్ ప్రీవెడ్డింగ్ షో' చిత్రంతో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఈ యువ హీరో ఈ సారి 'పాపం ప్రతాప్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. అయితే సరైన పబ్లిసిటి లేకపోవడం వల్ల 'ది గ్రేట్ ప్రీవెడ్డింగ్' అనే సినిమా ప్రేక్షకులకు చేరువ కాలేదని, దీంతో ఓ మంచి సినిమా థియేటర్‌లో సరైన కలెక్షన్లు సాధించలేదని, ప్రతి ప్రెస్‌మీట్‌లో తన అసంతృప్తిని వ్యక్తం చేసిన తిరువీర్ ఈ సారి 'పాపం ప్రతాప్'కు పబ్లిసిటిపై శ్రద్ధ పెట్టాడు. అవకాశం దొరికిన ప్రతిసారి 'పాపం ప్రతాప్' అనే టైటిల్‌కు తగ్గట్టుగా తనపై ఆడియన్స్‌కు సింపథి కలిగేలా ఉపన్యాసాలు, ప్రశ్నలకు, సమాధానాలు ఇవ్వడంతో పాటు, రకరకాల పబ్లిసిటి క్యాంపెయిన్‌లు, ఇంటర్వ్యూల్లో పాల్గొని 'పాపం ప్రతాప్'కు ఆడియన్స్‌లో బజ్ తీసుకరావడానికి ప్రయత్నించాడు. ఇక 'పాపం ప్రతాప్' కథాంశం ఏమిటి? ఈ సినిమా ఎలా ఉంది? ప్రేక్షకులకు ఈ చిత్రం వినోదాన్ని పంచిందా? లేదా? తిరువీర్ పబ్లిసిటి మంత్రం ఫలించిందా? లేదా అనేది రివ్యూలో తెలుసుకుందాం. సీతారామపురంలో అనే గ్రామంలో ఉండే ప్రతాప్ (తిరువీర్)కి అదే ఊరిలో ఉండే బుజ్జమ్మ (పాయల్ రాధాకృష్ణ) అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. స్కూల్ డేస్ నుంచే ప్రేమించిన బుజ్జమ్మకు యుక్త వయసు రాగానే తన ప్రేమను తెలియజేసి పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి తరువాత ప్రేమ ఎలా ఉంటుందో చూద్దామని ఇద్దరూ కలిసి ఒక్కటవుతారు. అయితే మొదటి మూడు రాత్రులు గడిపిన తరువాత బుజ్జమ్మ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెడుతుంది. ప్రతాప్‌కు ఓ విచిత్రమైన సమస్య ఉందని, ఆయనతో ఉండటం ఇష్టం లేదని చెప్పి పుట్టింటికి వెళ్లిపోతుంది. అయితే ఆ సమస్య ఏమిటో ఎవరికి చెప్పదు. ప్రతాప్‌తో మాత్రం ఆ సమస్య ఏమిటో నువ్వే తెలుసుకుని, దానిని తగ్గించుకోని వస్తే కాపురానికి వస్తానని చెబుతుంది. దీంతో బుజ్జమ్మపైనే తన పంచ ప్రాణాలు పెట్టుకున్న ప్రతాప్ ఏం చేశాడు? తన సమస్యను ఎలా తెలుసుకున్నాడు? మొదట్నుంచీ బుజ్జమ్మతో పెళ్లి ఇష్టం లేని ప్రతాప్ తండ్రి వీరయ్య ఈ సమయంలో ( అజయ్ ఘోష్) ఏం చేశాడు? అసలు ప్రతాప్ అనారోగ్య సమస్య ఏమిటి? దానిని ఎలా తగ్గించుకున్నాడు? తగ్గిందా? లేదా?, ప్రతాప్, బుజ్జమ్మలు కలిసిపోతారా? లేదా? అనేది చిత్ర కథాంశం. ఈతరం ప్రేక్షకులు కథాంశంలో కొత్తదనం, ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటే సినిమాలను ఆదరిస్తున్నారు. అందుకే నూతన దర్శకులు కొత్త కాన్సెప్ట్‌లతో ముందుకు వస్తున్నారు. అయితే కథాంశం కన్విన్సింగ్‌గా ఉంటేనే అవి ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. ఈ చిత్ర దర్శకుడు కూడా కథానాయకుడికి ఓ విచిత్రమైన సమస్యను క్రియేట్ చేసి, దాని చుట్టు వినోదాన్ని అల్లుకుని సినిమా ఆద్యంతం కొనసాగించే ప్రయత్నం చేశాడు. అయితే దర్శకుడు ఎంచుకున్న కాన్సెప్ట్ కన్విన్సింగ్‌గా లేకపోవడం, వినోదం కూడా పండకపోవడంతో సినిమా మొదట్నుంచే నత్తనడకన సాగుతున్న ఫీల్ కలుగుతుంది. సినిమా ప్రారంభ సన్నివేశంలో కథ ఎక్కడ ఉందో, పతాక సన్నివేశాల వరకు కథాంశం ముందుకు కదలకుండా అక్కడే ఉన్న ఫీల్ కలిగిస్తుంది. ప్రతి సన్నివేశం రీపీటెగా చూస్తున్నామనే భావన కలుగుతుంది. ప్రతాప్‌లో ఉన్న సమస్యపై అందరిలో ఉత్సుకత కలిగించిన దర్శకుడు, ఆ సమస్య రీవీల్ చేసిన తరువాత ఊసురమనిస్తుంది. ఎందుకంటే కథానాయకుడి సమస్యపై పూర్తి క్లారిటి ఉండదు. ఇక వినోదంలో భాగంగా గోపరాజు రమణ, షకీలా సినిమాలపై పెంచుకున్న మోజు, షకీలా సినిమా టిక్కెట్ కోసం ఏకంగా తన కూతురుని ఇచ్చి పెండ్లి చేస్తానని మాట ఇవ్వడం వంటి సీన్స్ ఇబ్బందికరంగా అనిపిస్తాయి. దీంతో పాటు హీరో, తన స్నేహితుడుతో కలిసి తన సమస్యను కనుక్కోవడానికి చేసే ప్రయత్నంలో వచ్చే సన్నివేశాలు ఇరిటేషన్ తెప్పిస్తాయి. ఆలు మగల మధ్య ఉన్న సమస్యను, భర్తపై అమితమైన ప్రేమ ఉన్న భార్య వెంటనే రచ్చబండ మీదికి తీసుకరాదు. ఇక ఈ సమస్యకు కథానాయకుడి ప్రేమకు ముడిపెట్టడం కూడా అంతగా సరిపోలేదు. ఓ చిన్న కాన్సెప్ట్‌కు, వినోదాన్ని జోడించి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలన్న 'పాపం ప్రతాప్' ప్రయత్నం విఫలమైంది. ఫస్టాఫ్ భారంగా నడిస్తే... సెకండాఫ్ ప్రేక్షకుల సహనానికి మరింత పరీక్ష పెడుతుంది. ప్రతాప్ పాత్రలో తిరువీర్ అమాయకంగా, భార్యపై ప్రేమ ఉన్న భర్తగా కనిపించిన విధానం సహజత్వం లోపించింది. కొన్ని సన్నివేశాల్లో ఆయన నటన మెప్పిస్తుంది. ప్రతాప్ తండ్రి అజయ్ ఘోష్ సినిమా ఆద్యంతం ఒకే మూడ్‌లో కనిపించాడు. పతాక సన్నివేశాల్లో హీరో తల్లిగా రాశి నటన అలరిస్తుంది. ప్రసాద్ బెహరా, గోపరాజు రమణ, రఘుబాబు దేవిప్రసాద్, ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించారు. పాటలు ఫర్వాలేదనిపించాయి. కథకు తగ్గట్టుగా నిర్మాణ విలువలు కనిపించాయి. ఈ రోజుల్లో చిన్న సినిమాలకు ప్రేక్షకులు థియేటర్స్ వరకు రావాలంటే ఖచ్చితంగా వాళ్లకు థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే స్ట్రాంగ్ కంటెంట్ కావాలి. 'పాపం ప్రతాప్' ఈ విషయంలో పూర్తిస్థాయిలో సక్సెస్ కాలేదు. ఏ మాత్రం ఆకట్టుకోని కథాంశంతో...సాగదీతగా ఉన్న సన్నివేశాలతో ఉన్న ఈ సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ప్రేక్షకుడు వెతుక్కోవాల్సిందే.



# విడాకులపై స్పందించిన హన్సిక!

తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# 11 ఏండ్ల తర్వాత..

అగ్ర కథానాయిక త్రిష సొంత గొంతుతో డబ్బింగ్ చెప్పడం చాలా అరుదు. తన మాతృభాష తమిళంలో సైతం ఓ ఐదు చిత్రాలకు మాత్రమే సొంతంగా డబ్బింగ్ చెప్పింది. ఇక తెలుగులో ఈ భామ పూర్తిగా డబ్బింగ్ ఆర్టిస్టులపైనే ఆధారపడుతుంది. తాజా సమాచారం ప్రకారం దాదాపు 11 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత త్రిష తమిళంలో సొంత గొంతును వినిపించబోతున్నది. సూర్య 'కరుప్పు' సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె తన పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెప్పుకోబోతున్నదట. పాత్రలో సహజత్వం కనిపించాలంటే ఓన్ డబ్బింగ్ అవసరమని దర్శకుడు ఆర్‌జే బాలాజీ సూచన మేరకు త్రిష ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది. త్రిష వాయిస్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని, ఇకపై కూడా ఈ సొగసరి డబ్బింగ్ విషయంలో సొంత గొంతు వినిపించేందుకు సిద్ధంగా ఉందని తమిళ ఫిల్మ్‌నగర్ టాక్. 'కరుప్పు' చిత్రం మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com